# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 04-07-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని భారత్ సమర్థవంతగా అధిగమించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈనెల 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి.
- భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య మాంఛెస్టర్ వేదికగా రెండో టీ-20 క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.
- రానున్న నాలుగు రోజుల్లో గుజరాత్, హరియాణా, రాజస్థాన్ రాష్ట్రాల్లో నైరుతి రుతుపవనాలు పూర్తిగా విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

రాజస్థాన్ లో లక్షా 5 వేల కోట్ల రూపాయలకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మొదట జోధ్‌పుర్ విమానాశ్రయంలో నూతన టెర్మినల్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం బాలోత్రా జిల్లా పచ్‌పద్రలో దేశంలోనే అత్యంత ఆధునికమైన 'గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ కమ్ పెట్రోకెమికల్ కాంప్లెక్స్'ను జాతికి అంకితం చేశారు. ఇదే వేదిక నుంచి జైపూర్ మెట్రో ఫేజ్-2 నిర్మాణానికి ప్రధాని దృశ్య మాధ్యమం ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. పశ్చిమాసియాలో జరిగిన ఘర్షణలు 21వ శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని తెచ్చాయని, కానీ భారత వ్యూహాత్మక నిర్ణయాలు, సమర్థవంతమైన దౌత్యం, జాతీయ వనరుల సక్రమ వినియోగంతో సంక్షోభాన్ని అధిగమించిందని తెలిపారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరిగినా.. దేశీయంగా వంటగ్యాస్, పెట్రోల్ ధరలు పెరగకుండా ప్రభుత్వం కట్టడి చేసిందని ప్రధాని స్పష్టం చేశారు. అంతర్జాతీయ ధరల ప్రభావం ప్రజలపై పడకుండా ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో చమురు కంపెనీలు పెట్రోల్, డీజిల్ ధరలపై ఎదుర్కొన్న దాదాపు 75 వేల కోట్ల రూపాయల భారీ నష్టాన్ని ప్రభుత్వమే భరించిందని భరించిందని వివరిస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

గుజరాత్‌లోని సానంద్‌లో ఏర్పాటు చేసిన 'సీజీ సెమీ అవుట్‌సోర్స్ డ్ సెమికండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్' (OSAT) ప్లాంట్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ప్రారంభించారు. దేశీయ సాంకేతిక తయారీ రంగంలో అత్యంత కీలకమైన ఈ ప్రతిష్టాత్మక కేంద్రాన్ని 7 వేల 500 కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడితో నిర్మించారు. ఈ ప్లాంట్ ఏటా దాదాపు 500 కోట్ల (5 బిలియన్) సెమికండక్టర్ చిప్‌లను ఉత్పత్తి చేయనున్నది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ ఫోన్ల తయారీ దేశంగా నిలిచిన భారత్.. ఇప్పుడు ఎలక్ట్రానిక్స్ విప్లవంలో తదుపరి దశకు చేరుకుందని స్పష్టం చేశారు. సానంద్‌లోని సీజీ సెమీ ఓశాట్ (OSAT) ప్లాంట్ దేశీయ చిప్ తయారీ రంగాన్ని బలోపేతం చేయడమే కాకుండా, సాంకేతిక స్వయం సమృద్ధిని పెంచుతూ.. అంతర్జాతీయ సెమికండక్టర్ సరఫరా వ్యవస్థలో భారత్ ను అగ్రస్థానానికి చేరుస్తుందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఆగస్టు 13వ తేదీ వరకు ఈ సమావేశాలు కొనసాగుతాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఈరోజు వెల్లడించారు. జులై 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను నిర్వహించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ఒక ప్రకటన విడుదల చేసిన కేంద్రమంత్రి.. దేశానికి సంబంధించిన పలు కీలక, ప్రాధాన్యత కలిగిన అంశాలపై ఈ సమావేశాల్లో అర్థవంతమైన చర్చలు, నిర్ణయాలు జరుగుతాయని తెలిపారు. రాబోయే సమావేశాలు సజావుగా సాగేందుకు అన్ని పక్షాలు సహకరించాలని కిరణ్ రిజిజు కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ధరల స్థిరీకరణ కోసం సేకరించే ఉల్లి మద్దతు ధరను ప్రభుత్వం 13 శాతం మేర పెంచింది. ఇప్పటివరకు క్వింటాల్‌కు 1,875 రూపాయలుగా ఉన్న కొనుగోలు ధరను 2 వేల 125 రూపాయలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ సవరించిన ధరలు నేటి నుంచే అమల్లోకి వస్తాయని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ ఈరోజు ప్రకటించింది. పెంచిన కొనుగోలు ధర వల్ల ఉల్లి సాగు చేసే రైతులకు మెరుగైన లాభాలు అందుతాయని, అలాగే బఫర్ స్టాక్ సేకరణ వేగవంతమవుతుందని ఆ శాఖ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత్-ఇజ్రాయెల్ దేశాల మధ్య కుదిరిన 'ద్వైపాక్షిక పెట్టుబడుల ఒప్పందం' ఈరోజు నుంచి అధికారికంగా అమల్లోకి వచ్చింది. గతేడాది సెప్టెంబర్‌లో ఢిల్లీ వేదికగా ఈ చారిత్రక ఒప్పందంపై ఇరు దేశాలు సంతకాలు చేసిన సంగతి తెలిసిందే. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక, ఆర్థిక సంబంధాలను పటిష్టం చేయడానికి, పెట్టుబడులకు సురక్షితమైన, పారదర్శకమైన వాతావరణాన్ని కల్పించడానికి ఈ ఒప్పందం ఒక మైలురాయిగా నిలుస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

ముంబై-అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ కారిడార్ ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, 2029 చివరి నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. గుజరాత్‌లో పలు రైల్వే ప్రాజెక్టుల ప్రగతిపై అహ్మదాబాద్‌లో ఆయన ఈరోజు సమీక్ష నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.. బుల్లెట్ రైలు

ప్రాజెక్టుకు సంబంధించి గుజరాత్ పరిధిలోని పనులు ఇప్పటికే 80 శాతం పూర్తయ్యాయని వెల్లడించారు. హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్‌ను విడతల వారీగా అందుబాటులోకి తెస్తామని రైల్వే మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

తయారీ, సాంకేతిక రంగాలలో దేశం అద్భుతమైన ప్రగతి సాధించిందని, దేశ రక్షణ రంగ ఎగుమతులు రికార్డు స్థాయిలో 38 వేల కోట్ల రూపాయలకు పైగా చేరాయని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఢిల్లీలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... 2013-14 ఆర్థిక సంవత్సరంలో కేవలం 686 కోట్లుగా ఉన్న రక్షణ ఎగుమతులు.. నేడు 57 రెట్లు పెరిగాయన్నారు. 'మేక్ ఇన్ ఇండియా' రక్షణ ఉత్పత్తులపై అంతర్జాతీయంగా ఉన్న నమ్మకానికి ఇది నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. గడచిన 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశీయ వార్షిక రక్షణ రంగ ఉత్పత్తి రికార్డు స్థాయిలో లక్షా 78 వేల కోట్ల రూపాయలకు పైగా చేరిందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా ఈరోజు ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనకు నివాళులర్పించారు. ఈ మేరకు వారు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యేక సందేశాలను పంచుకున్నారు. భారతదేశ సాంస్కృతిక చైతన్యాన్ని స్వామి వివేకానంద పునరుజ్జీవింపజేశారని, కాలాతీతమైన భారతీయ జ్ఞానాన్ని ప్రపంచానికి చాటి చెప్పారని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ బొమ్మల పరిశ్రమలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, విదేశాల నుంచి బొమ్మల దిగుమతులు భారీగా తగ్గాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఢిల్లీలో '17వ టాయ్ బిజ్ ఇంటర్నేషనల్ బీ2బీ ఎక్స్‌పో" ను కేంద్రమంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో అత్యధిక శాతం 'మేడ్ ఇన్ ఇండియా' బొమ్మలే విక్రయమవుతున్నాయని స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఉగ్రవాద నిరోధక చట్టం—యూఏపీఏ (UAPA) కింద పాకిస్తాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న 23 మందిని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఉగ్రవాదులుగా ప్రకటించింది. వీరంతా జైషే మహ్మద్, లష్కరే తోయిబా వంటి నిషేధిత ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు కలిగి ఉన్నట్లు ఆ శాఖ స్పష్టం చేసింది. వీరు పాకిస్తాన్, పాక్ ఆక్రమిత జమ్మూకశ్మీర్ (PoJK)ల నుంచి భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడుతున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో విమానయాన రంగాన్ని సామాన్యుడికి మరింత చేరువ చేస్తూ.. ప్రాంతీయ అనుసంధానతను పెంచేందుకు 'సవరించిన ఉడాన్' పథకం దోహదపడుతుందని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 28 వేల 840 కోట్ల రూపాయలకు పైగా భారీ వ్యయంతో ఈ ప్రతిష్టాత్మక పథకాన్ని ప్రారంభించిన నేపథ్యంలో కేంద్రమంత్రి ఈరోజు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యేక సందేశాన్ని పోస్ట్ చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య ఐదు టీ-20ల సిరీస్‌లో భాగంగా రెండో క్రికెట్ మ్యాచ్ లో భారత్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. మాంఛెస్టర్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్ లో భారత్ 17 ఓవర్లు పూర్తయ్యే సరికి 4 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది.

======================

రాబోయే నాలుగు రోజుల్లో గుజరాత్, హరియాణా, పంజాబ్, రాజస్థాన్ అంతటా నైరుతి రుతుపవనాలు పూర్తిగా విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది.

======================

======================